భారీ వర్షాల నేపథ్యంలో
విద్యుత్తు అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరంకోట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం తో భారీ వర్షాల సూచన నేపథ్యంలో అధికారులను, సిబ్బందిని ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎమ్.లక్ష్మణ రావు అప్రమత్తం చేశారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. 9490610102 నెంబర్ తో 24 గంటలపాటు 3 షిఫ్టులలో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాల కారణంగా 'తెగిపడిన విద్యుత్ వైర్లను గాని, తడిసిన విద్యుత్ స్తంభాలను గాని, విద్యుత్ వైర్ల పై తెగిపడిన చెట్ల కొమ్మలను గాని ప్రజలు నేరుగా తాక వద్దని విజ్ఞప్తి చేశారు. వర్షం కారణంగా ఏదైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసుకు గాని, టోల్ ఫ్రీ నంబరు 1912 కు గాని కంట్రోల్ రూమ్, సర్కిల్ ఆఫీస్, విజయనగరం నెంబర్-9490610102 కు గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఉత్సవం.. వైభవం

- ఓవైపు పైడితల్లమ్మ పండగ.. మరోవైపు ఉత్సవాలు
- నగరమంతా సందడే సందడి
- విద్యుత్తు అలంకరణతో కాంతులీనిన నగరం

భక్తి గేయానికి కళాకారిణుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/టౌన్/కోట

కళలకు పుట్టినిల్లయిన విజయనగరంలో ఓవైపు పైడితల్లమ్మవారి పండగ హడావుడి... ఇంకోవైపు విజయనగర ఉత్సవాల ప్రాభవంతో నగరమంతా సందడి నెలకొంది. జిల్లా చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా నిర్వహించిన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా వివిధ వేదికల్లో నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళలు, నాటకాలు, నాటికలు, పులివేషాలు, కత్తిసాములు ఇలా పలు కార్యక్రమాలు ప్రజలకు వీణుల విందు చేశాయి. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో నగరమంతా మెరిసిపోతోంది. శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడీ వంటి నృత్య కళా ప్రదర్శనలు. కట్టిపడేశాయి. జనపద కళారూపాలు, పులివేషాలు గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టాయి. క్రీడా పోటీలు, యుద్ధ క్రీడలు విద్యల నగరమనే పేరును గుర్తుకు తెచ్చాయి. వివిధ నాటికలు, అందులోనూ ఏకపాత్రాభినయాలు, పౌరానిక నాటకాలు చరిత్రకు సాక్షిభూతంగా నిలిచాయి. కవి సమ్మేళనాలు ఆధునిక సమాజ నిర్మాణానికి ఆవిష్కరణలుగా నిలిచాయి. వాయిద్య విన్యాసాలు, పండిత పాండిత్య ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు భాషా సంస్కృతిని గుర్తుచేశాయి. ఓవైపు అయోధ్యమైదానంలో సినీ సంగీత కళాకారులు, టీవీ ఆర్టిస్టుల వినోద వల్లరి కుర్రకారును ఉర్రూతలూగించింది. మరోవైపు పుష్పఫల ప్రదర్శనలు, ప్రదర్శన, దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన చేతివృత్తి ఉత్పత్తుల ప్రదర్శన శాల. ఇలా చెప్పుకుంటూ పోతే ఊరంతా సందడి నెలకొంది.

చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

సాంస్కృతిక నీరాజనం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో రెండో రోజు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. వరలక్ష్మి త్యాగరాజ సంగీత నృత్య కళానికేతన్ , వాగ్దేవి బృందం, గీతిక, టి సత్యనారాయణ, పి.సూర్య కుమారి , ఎస్.సత్యనారాయణ శర్మ, సౌమ్య, శ్రీ భగవతి నత్య కళామందిర్, ఆరాధ్య తేజేస్వి, వర్ణ డాన్స్ అకాడమీలు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్య విన్యాసాలు వీనుల విందుగా నిలిచాయి. కె.రంజని, జి.రాధిక, కె.పద్మప్రియ, బాలభవన్, ఆముక్త మాల్యద, ఎం.సత్య సాయి రోజా, సత్యలత, రామచంద్ర శేఖర్, మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాల వారు శాస్త్రీయ సంగీతాలను, భక్తి సంగీతాలను రమ్యంగా ఆలపించారు. వంశీకృష్ణ బృందం వీణ, ఎం.కామేశ్వరరావు ఫ్లూట్ వాయిద్యాలతో అలరించారు. ఘంటసాల స్మారక పీఠం వారు ఘంటసాల పాటలను ఆలపించారు. వేదిక ఇంఛార్జులు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమా శంకర్ , డివిజనల్ పిఆర్‌ఒ ఎస్.జానకమ్మ, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రీ, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తదితరులు మెమెంటోలను, సర్టిఫికేట్ లను అందజేసి శాలువలతో సత్కరించారు.

కోలాటం ఆడుతున్న బృందం

పులివేషధారులు

రంజింపజేసిన జానపద కళారూపాలు

లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆదిభట్ల నారాయణదాసు కళాప్రాంగణం జానపద కళారూపాల ప్రదర్శనతో, హరికథా గానంతో మార్మోగింది. తొలుత ఆదిభట్ల రవి పైడితల్లి చరిత్ర హరికథా గానంతో ప్రేక్షకులను అలరించారు. కనకమహాలక్ష్మి జానపద గీతాల ఆలాపన చేశారు. జానపద కళాబృందాలు కోలాటం, చెక్కభజన కళారూపాలను ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశాయి. పైడితల్లి అమ్మవారిపై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని కూడా ప్రదర్శించారు.

వీనులు విందుగా ఏకపాత్రాభినయాలు

గురజాడ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఏకపాత్రాభినయాలు అందరినీ అలరించా యి. సత్యహరిశ్చంద్ర నాటకంలో వివిధ సన్నివేశాలను నక్షత్ర, సత్య హరిచంద్ర, దేవి చంద్రమతి ఇలా వివిధ ఏకపాత్రాభినయాలు రంజింపజేశాయి.

ఉర్రూతలూగించిన కార్తీక్

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా అయోధ్యా మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన మెగా మ్యూజికల్ నైట్ అందరినీ అలరించింది. ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు కార్తీక్ యువతను ఉర్రూతలూగించారు. ఆయన పాడిన సినీపాటలు యువతీ యువకులతో డాన్సులు చేయించాయి. కార్యక్రమాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తిలకించారు. వేలాదిగా వచ్చిన జనం స్థలం లేక ఇబంది పడ్డారు.

ఆకర్షించిన ఫ్లవర్ షో

పూలతో తయారు చేసిన డాల్ఫిన్ ఆకృతులు

ట్యాంక్‌బండ్ రోడ్డులోని మాన్సాస్ స్థలంలో ఏర్పాటు చేసిన పుష్ప ప్రదర్శన సందర్శకులను విశేషంగా అకట్టుకుంది. గతం కంటే భిన్నంగా ఈసారి పుష్పాలతో తయారు చేసిన వివిధ రకాల పక్షులు, క్రీడ, వాయిద్య పరికరాలు అందరినీ కట్టిపడేస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చి ఏర్పాటు చేసిన రక రకాల పుష్పాలు మగువుల మనసును దోచుకుంటున్నాయి. సందర్శకులు ఇక్కడ ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడుతున్నారు. ప్రదర్శనలో ఫ్రెష్ ఫ్లవర్స్, డ్రై ఫ్లవర్స్, వెజిటబుల్ కార్వింగ్, సైకత శిల్పం, వివిధ రకాల మొక్కలను ప్రదర్శించారు.

అలరించిన వేణుగానం

వేణువు వాయిస్తున్న కామేశ్వరరావు

స్థానిక ఆనంద గజపతి కళాక్షేత్రంలో రెండోరోజు సోమవారం నిర్వహించిన లలిత ,శాస్త్రీయ సంగీత కార్యక్రమాలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకు న్నాయి. వాటితోపాటు అంత రించి పోతున్న వేణు గానానికి అవకాశం కల్పించారు. గడిచిన 30 ఏళ్ల నుంచి వేణుగానం కోసం ఎంతో ప్రచారం చేస్తున్న కామేశ్వరరావు ఆలపించి, అలరించారు. చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి వివిధ నృత్యరూపాలు ఎంత గానో ఆకట్టుకున్నాయి.

ఘటాన్ని తీసుకెళ్తున్న హోంమంత్రి అనిత ; ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ గజపతిరాజు

ఘనంగా తొలేళ్ల సంబరం

పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్ కుటుంబీకులు

అమ్మవారిని దర్శించుకున్న హోంశాఖా మంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్ /కోట

విజయనగరం పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం నుంచి కోట వరకు ఘటాలు ఊరేగింపుగా వెళ్లి కోటలోని రౌండ్ మహల్‌లో ఘటాలు ఉంచి పూజలు చేశారు. అనంతరం కోట ఎదురుగా ఘటాలను ఉంచి పూజారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. తొలేళ్ల ఉత్సవం నేపథ్యంలో ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. వందలాదిగా మహిళలు అమ్మవారికి ఘటాలు తీసుకెళ్లి సమర్పించారు. పులివేషాలు, కర్రసాతిము, కత్తిసాము, విచిత్ర వేషధారణలతో నగరంలో సందడి నెలకొంది. మాన్సాస్ చైర్మన్, పైడితల్లి అమ్మవారి ఆలయం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి గజపతిరాజు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పించారు. హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత ఘటాలు మోసుకొని వెళ్లి అమ్మవారిని తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు పూర్ణ కుంభం తో స్వాగతం పలికారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దంపతులు పైడితల్లి అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఘటంతో యువతి

సిరిమానోత్సవ భద్రతా ఏర్పాట్లపై హోంమంత్రి సమీక్ష

రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటాన్ని సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆమెకు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కంట్రోల్ రూమ్ సందర్శించారు. సినిమానోత్సవం సందర్భంగా చేసిన పద్ధతి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఆమె వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, దేవాదాయశాఖ ఎసి రామచంద్ర మోహన్, సిఎఫ్‌ఒ త్రినాధరావు ఉన్నారు.

ఆలయం వద్ద ఘటాలతో భక్తులు

కళలకు పుట్టినిల్లు విజయనగరం

విజయనగరం ఉత్సవాలు ముగింపు సభలో హోంమంత్రి అనిత

ఉత్సవాలు ముగింపు సభలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం కళలకు పుట్టినిల్లు అని హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. రెండురోజులపాటు ఘనంగా నిర్వహించిన విజయనగరం ఉత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. అయోధ్యా మైదానంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరం సాంస్కృతిక వైభవం ఎంతో గొప్పదని కొనియాడారు. పూసపాటి వంశం విద్య, కళలకు వందల ఎకరాలను దానమిచ్చిందని కితాబిచ్చారు. మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ విజయనగరం ఉత్సవాలను జిల్లా అధికార బృందం విజయవంతంగా నిర్వహించిందని అభినందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ విజయనగరం ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 12 వేదికల్లో వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించామని చెప్పారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ పైడిమాంబ దయతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చెప్పారు.

సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ విజయనగరం ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం 2019 లో ప్రకటించిందని, అధికారికంగా తొలిసారి నిర్వహిస్తున్నామని చెప్పారు. మన పెద్దల వారసత్వాన్ని నిలబెట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. విజయనగరం ఉత్సవాలతో విజయనగరం వెలిగిపోతోందని ఆనందం వ్యక్తంచేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉత్సవ కమిటీ శాశ్వత సభ్యులు, వేదిక ఇన్‌చార్జులు పి.బాలాజి, పిఎన్‌వి లక్ష్మీనారాయణ, పెంటోజీరావు, జిల్లా అధికారులు పాలొన్నారు.

పైడితల్లమ్మ ఆలయం వద్ద జనాల రద్దీ

సిరిమాను సంబరానికి సర్వం సిద్ధం

- 3 గంటలకు ప్రారంభం
- అందరికీ ఉచిత దర్శనాలే
- 2వేల మందితో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉత్తరాంధ్రులు ఇలవేల్పుగా భావించే విజయనగరం పైడితల్లమ్మ సిరిమాను సంబరానికి సర్వం సిద్ధమైంది. అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సందర్శకులు లక్షలాదిగా తరలివస్తారని అధికార యంత్రాంగం భావిస్తున్నారు. అందుకు తగ్గట్టే చదురు, వనంగుడుల వద్ద ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకే సిరిమాను సంబరం ప్రారంభం కానుంది. సిరిమాను తిరిగే ప్రాంతంలో ఇప్పటికే బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించనున్నారు. ఈ సంబరంలో సిరిమానుకు ముందు పాలధార, అంజలిరథం, ఏనుగు రథం, బెస్తవాని వల నడుస్తాయి. ముందుగా ఉదయం 11 గంటలకు హుకుంపేటలోని ఆలయ పూజారి ఇంటి వద్ద సిరిమాను బయలుదేరి పుచ్చలవీధి, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్థంభం మీదుగా అమ్మవారి ఆలయానికి సంప్రదాయ మేళతాళాల నడుమ చేరుకోనుంది. 12 గంటలకు ఆలయానికి చేరుకునేలా ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. అమ్మవారి పండక్కి రూ.50లక్షలు ఖర్చు చేయనున్నట్టు పైడితల్లమ్మ దేవస్తానం సహాయ కమిషనర్ డివి ప్రసాదరావు స్పష్టం చేశారు. సంబరం సజావుగా జరిపేందుకు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యాన పలు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నారు. ముఖ్యంగా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, అటవీ, విద్యుత్తు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, తదితర శాఖలు కీలక సేవలందిస్తున్నాయి.

ఈ ఏడాది భక్తులకు ఉచిత ఉచిత దర్శన సదుపాయం కల్పించారు. క్యూలైన్లు, ఆలయ దర్శన సమయంలో భక్తులు ఎండబారిన పడకుండా చలువ పందిళ్లు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. ఆలయంలో వేద మంత్రాలు, ఇతర పూజల కోసం ఉత్తరాంధ్రాలోని వివిధ ఆలయాలకు చెందిన 100మంది అర్చకులను నియమించారు. వీరంతా మూడు షిఫ్టుల్లో సేవలందిస్తారు. లక్షలాదిగా తరలివచ్చే సందర్శకులకు నీరు, మజ్జిగ వంటి సేవలందించేందుకు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది సరిపడినన్ని పులిహోరా ప్యాకెట్లతోపాటు 50వేల లడ్డూలు తయారు చేసినట్టుగా సమాచారం. లడ్డూ రూ.15, పులిహోరా ప్యాకెట్ రూ.10 చొప్పున విక్రయించనున్నారు.

పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇందుకోసం పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, విశాఖపట్నం సిటీ, ఇతర జిల్లాల నుంచి కూడా పోలీసు అధికారులు, సిబ్బంది సుమారు 2వేల మంది ఇప్పటికే నగరంలో ఉన్నారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సందర్భంగా భద్రత, బందోబస్తు ఏర్పాట్లును ఎస్‌పి వకుల్‌జిందాల్ సోమవారం పర్యవేక్షించారు. ఆర్టీసి కాంప్లెక్సు, బాలాజీ జంక్షను, ఐస్ ఫ్యాక్టరీ జంక్షను, సింహాచలం మేడ, కోటజంక్షను, మూడు లాంతర్లు, శ్రీ పైడితల్లమ్మ ప్రధాన ఆలయం, గంట స్థంభం, కమాండ్ కంట్రోల్‌ను సందర్శించి, స్వయంగా భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసారు. కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన పెద్ద టివిల్లో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అమర్చిన సిసి కెమెరాల ద్వారా భద్రత ఏర్పాట్లను ఎస్‌పి పర్యవేక్షించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ అమ్మవారిని దర్శించుకొనే క్రమంలో తల్లిదండ్రులు నుంచి తప్పిపోయిన పిల్లలను గుర్తించి, సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ లేదా హెల్ప్ డెస్క్ లకు అందించి, వారి తల్లిదండ్రులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో విలువైన వస్తువులు పోకుండాను, జేబు, మొబైల్ దొంగతనాలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో మాట్లాడే సమయంలో సంయమనం పాటించాలని, ఏదైనా ఇబ్బందులు తలెత్తితే ఇన్చార్జ్గా వ్యవహరించే అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. భక్తులకు త్వరితగతిన దర్శనాలు అయ్యే విధంగా క్యూ లైన్లలో భక్తులను పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, అనకాపల్లి క్రైం అదనపు ఎస్‌పి ఎల్.మోహనరావు, సిఐలు బి.వెంకటరావు, ఇ.నర్సింహమూర్తి, ధనుంజయ్, సతీష్ కుమార్, ఆర్ఐ ఎన్. గోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి జిందాల్

ఇక తెరవడమే తరువాయి

- ముగిసిన మద్యం దుకాణాల లాటరీ
- అంతా సిండికేట్
- లైసెన్సు ఫీజులో ఆరో వంతు చెల్లిస్తే ఏర్పాట్లుకు అనుమతి
- 16 నుంచి తెరుచుకోనున్న మద్యం షాపులు

లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మద్యం దుకాణాల ఏర్పాటుకు లాటరీ ప్రక్రియ ముగిసింది. జిల్లాలోని 153 దుకాణాలకూ లాటరీ ద్వారా దుకాణాలు కేటాయింపు జరిగిపోయింది. ఇక లైసెన్సు ఫీజు చెల్లించడమే తరువాయి. ఈనెల 16 నుంచే దుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ్ శాఖ అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తం మొత్తం లైసెన్సు ఫీజులో 6వ వంతు మొత్తం ఈ లోగా చెల్లించాల్సి వుంటుంది. మద్యం దుకాణాల కేటాయింపునకు కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ అంబేద్కర్ సమక్షంలో సోమవారం లాటరీ తీశారు. సాయంత్రం వరకు ఈ లాటరీ ప్రక్రియ కొనసాగింది. మొత్తం జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 153 దుకాణాల ఏర్పాటుకు సంబంధించి 5,237 దరఖాస్తులు అందిన విషయం విధితమే. షాపుల వారీగా నిర్వహించిన ఈ లాటరీ కార్యక్రమానికి వేల సంఖ్యలో దరఖాస్తుదారులు తరలి వచ్చారు. ఇలా వచ్చినవారితో కలెక్టరేట్ లోపల, ప్రాంగణంలోనూ, వెలుపల కోలాహలంగా మారింది. వచ్చినవారిలో సగం మంది మహిళలు కావడం విశేషం. లాటరీ ప్రశాంతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. భోగాపురం మండలంలో భార్యా భర్తలకు చెరొక దుకాణం దక్కిటనట్టుగా సమాచారం.

లైసెన్సు దక్కిన వారు నిర్ధేశించిన దుకాణం పరిధిలో 10వేల లోపు జనాభా ఉంటే లైసెన్సు ఫీజు రూ.50లక్షలు చెల్లించాల్సివుంటుంది. 10వేల నుంచి 50వేల లోపు జనాభా అయితే రూ.55లక్షలు, 50వేల నుంచి 5లక్షల లోపు జనాభా గలిగిన దుకాణానికి రూ.65లక్షలు, 5లక్షల జనాభా పైబడిన దుకాణాలకు రూ.85లక్షల చొప్పున ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు చెల్లించాల్సివుంటుంది. నిర్ధేశించిన సొమ్మును మొత్తం ఆరు వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. మొత్తం రుసుములో 6వ వంతు చెల్లించిన వెంటనే దుకాణం తెరుచుకునేందుకు అనుమతులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఒక ఏడాది తరువాత 10శాతం అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ లైసెన్సుకు రెండేళ్ల కాలపరిమితి కూడా ప్రభుత్వం విధించింది. 2026 సెప్టెంబర్ 30తో ముగియనుంది.

ఇవీ నిబంధనలు

కార్పొరేషన్ పరిధిలోని దుకాణాలు ఆ నగరానికి 5కిలో మీటర్లలోపు ఎక్కడైనా పెట్టుకోవచ్చు. మున్సిపాల్టీ పరిధికి 2కిలో మీటర్లలోపు పెట్టుకునేందుకు అవకాశం ఉంది. గ్రామాల్లో అయితే, ఆ దుకాణం పరిధిలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చు. మద్యం దుకాణాలను బడి, గుడి, చర్చి, మసీద్ తదితర ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులకు కనీసం 100 మీటర్ల దూరంలో ఉండాలి. 30పడకల ఆసుపత్రులకు కూడా 100 మీటర్ల దూరం పాటించాల్సివుంది.

అంతా సిండికేట్

మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వారంతా ఇప్పటికే సిండికేట్‌గా మారారు. పది నుంచి 30 మంది వరకు సిండికేట్‌గా ఏర్పాటై షాపు ఎవరికి దక్కినా అందరికే వాటా ఉండేలా అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. దరఖాస్తు రుసుం ఎవరూ నష్టపోకుండా కలిసి వ్యాపారం చేసుకునేందుకు ఇలా ఒకటయ్యారు. మరోవైపు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించడంతో ఎన్‌ఆర్‌ఐలు, పలువురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరున దరఖాస్తు చేసినట్లు తెలిసింది.

సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

సాయిబాబాకు ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో సోమవారం సిపిఎం, సిపిఐ, పికెఎస్, రైతు సంక్షేమ సంఘం, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ సాయిబాబా సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, పికెఎస్ నాయకులు ఆర్.సత్యం మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన ప్రశ్నించిన వారిని అర్బన్ నక్సలైట్లుగా చిత్రీకరించి జీవిత ఖైదీలుగా జైల్లో మగ్గించడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేయడమేనన్నారు. జీవితాంతం ప్రజల పక్షాన నిలిచిన నేరానికి పదేళ్ల జైలు శిక్ష అనుభవించి, అనారోగ్యం పాలైన ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు రంప రాఘవరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. గోపాలం, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాళి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలను సోమవారం ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార వివరాలను, స్టాకును రికార్డులను పరిశీలించారు. బరువు తక్కువగా ఉండే పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

గీత కార్మికుల మద్యం షాపులు కేటాయించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

గీత కార్మికులు, సొండి సామాజిక తరగతికి మద్యం షాపులు మొదటి విడతలోనే కేటాయించాలని సొండి కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారికి షాపులు మొదటి విడతలో ఇవ్వకపోతే వ్యాపారం బాగా సాగే మద్యం దుకాణాలు దక్కే అవకాశం లేదని చెప్పారు.

బొబ్బిలిలో రైతుబజార్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మద్యం ధరలు తగ్గించిన ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. బొబ్బిలిలో రైతు బజార్ ఏర్పాటు చేసి రాయితీపై అన్ని రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

బొత్స కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వంగర

స్థానిక మాజీ సర్పంచ్ బొత్స రామారావునాయుడు అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 10న మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, ఆయన సోదరుడు కోండ్రు జగదీష్ మృతుని సోదరుడు మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావునాయుడును సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామారావునాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి మోహనరావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, ఉదయాన మురళీ కృష్ణారావు, బెజ్జిపురం శ్రీనివాసరావు, రవి, గణపతి, కృష్ణ, వంగర రేగిడి, సంతకవిటి, రాజాం మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కోర్టుఫీజు స్టాంపులు అందుబాటులోకి తేవాలని భారత న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసాదరావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు నెలలుగా కోర్టు ఫీజు స్టాంపులు లేకపోవడంతో న్యాయవాదులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్‌ను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులోకి తేవాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలో బిల్లలవలసలోని అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ఎంపిడిఒ జి.గిరిబాల పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. వ్యాధినిరోధక టీకాలు విషయమై అంగన్వాడీ ఎఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. పిల్లల బరువు, ఎత్తు, టీకాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ గిరిబాల.. అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎంలకు సూచించారు.

పారదర్శకత లోపించిన మద్యం టెండర్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మద్యం టెండర్లలో పారదర్శకత లోపించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మరిపి విద్యాసాగర్ అన్నారు. సోమవారం స్థానిక డిసిసి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో మద్యం వ్యాపారులు, అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి టెండర్లు వేశారని, దీనిద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని చెప్పారు. రాష్ట్రంలో 213 మద్యం షాపులకు తక్కువ దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇసుక, పేకాట క్లబ్బులు, మద్యం సిండికేట్లలో 15 శాతం కమీషన్ ఏర్పాటు చేయాలని జెసి దివాకర్ రెడ్డి బహిరంగంగా కోరడం టిడిపి అధికార దుర్వినియోగానికి నిదర్శనమని మండిపడ్డారు. సిండికేట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సరగడ రమేష్ కుమార్, ఎస్.శ్రీనివాసరావు, సుంకర సతీష్ పాల్గొన్నారు.

తేనీరు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

జివికె ఆధ్వర్యాన తేనీరు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఉత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి కోట జంక్షన్ వద్ద గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఉచితంగా తేనీరు (టీ) పంపిణీ చేశారు. ఉత్సవాలు, పండగల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న జివికె ఈ కార్యక్రమం చేపట్టడం పట్ల పలువురు అభినందించారు. కన్వీనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయ సంఘం నాయకులు జెవిఆర్‌కె ఈశ్వరరావు, డి.రాము, జెఆర్‌సి పట్నాయిక్, సన్యాసిరాజు, శ్రీదేవి పాల్గొని టీ పంపిణీ చేశారు.

నాలుగు గ్రామాల్లో డయేరియా విజృంభణ

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గుర్ల, గోషాడ, గూడెం, కెల్ల గ్రామాలలో డయేరియా ప్రబలింది. దీంతో రోగులు గుర్ల పిహెచ్‌సికి పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే గుర్లకు చెందిన చింతపల్లి అప్పారావు(65) డయేరియాతో బాధపడుతూ పిహెచ్‌సిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకున్నాక ఆదివారం ఉదయం ఇంటి వద్ద మృతి చెందారు. దీంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. కాగా సోమవారం ఉదయం గుర్లకు చెందిన మజ్జి పాపమ్మ, గేదెల ఝాన్సీ, గోషాడకు చెందిన రౌతు సత్యం, గూడెంకు చెందిన లోగిస యోగేశ్వరరావు వాంతులు, విరోచనాలతో పిహెచ్‌సిలో చేరారు. గ్రామాలలో పారిశుధ్య పనులు సరిగ్గా నిర్వహించకపోవడం, తాగునీటి పైపులు లీకులు వల్ల ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గుర్లలో డయేరియా ప్రభావం ఎక్కువగా ఉండడంతో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చెన్నయ్ గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గుర్ల గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు.

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

సోమవారం జిల్లా వైద్యాధికారి భాస్కరరావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, డయేరియా రోగులతో మాట్లాడి వ్యాధికి గురైన వారిని కారణాలను అడిగి తెలుసుకున్నారు. కలుషిత మైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియాకు గురవుతున్నారని గుర్తించినట్లు చెప్పారు. వ్యాధి ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. అవసరమై మందులను వెంటనే తెప్పించి పిహెచ్‌సిలో అందుబాటులో ఉంచాలని ఫార్మసిస్టును ఆదేశించారు. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి రాపిడ్ టీం వచ్చి తాగునీరు, సెంపిల్స్ తీసి ల్యాబ్ కి పంపించామని వ్యాధి బారిన పడిన చిన్నారులను విజయనగరం గోషా ఆసుపత్రికి రిఫర్ చేయాలని సంబంధిత డాక్టర్స్‌కు సూచించామని చెప్పారు తాగు నీరుకు సంబందించి వీధి కుళాయిలు ఆపివేసి ట్యాంకర్లతో తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామీణ తాగునీటి విభాగం అధికారులు తాగునీరు అందిస్తారన్నారు, గ్రామాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ప్రజలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని ఆయన అన్నారు. తాగేనీరు, తినే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

బాధితులను పరామర్శిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ భాస్కరరావు

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్ హైస్కూలులో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సుమారుగా 210 సైన్స్ ప్రాజెక్టులు విద్యార్థులను, సందర్శకులను ఆలోచింప జేశాయి. వాతావరణ కాలుష్యం చేయడం వల్ల కలిగే ప్రమాదాలు, నివారించేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలు, స్వయం ఉపాధి, శాస్త్ర ప్రయోగాల ఉపయోగాలు వంటి ప్రదర్శనలు విద్యార్థుల సృజనాశక్తికి ప్రతిబింబంగా నిలిచాయి. వీటితో పాటు చిత్రలేఖన ప్రదర్శన, నాణేలు, స్టాంపులు, ప్రపంచంలో లభ్యమవుతున్న పలు రకాల గనులు, శిలాజాలు ఎంతోగాను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్, ఇంజినీరింగ్ విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయన్నారు. రెండు రోజులు పాటు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను విజయవంతం చేసిన విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయులకు, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కబడ్డీ విజేత విజయనగరం జట్టుకు బహుమతి అందజేస్తున్న అధికారులు

వాలీబాల్, కబడ్డీ విజేతగా విజయనగరం

ఖో ఖో విజేత శ్రీకాకుళం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వాలీబాల్,కబడ్డి, ఖోఖో ఉత్తరాంధ్ర స్థాయి పోటిల్లో వాలీబాల్ ,కబడ్డి విజేతగా విజయనగరం జట్లు, ఖోఖో విజేత గా శ్రీకాకుళం జట్లు నిలిచాయి. వాలీబాల్ రన్నర్ గా స్టీల్ ప్లాంట్ జట్టు, మూడో స్థానంలో మన్యం జిల్లాలు నిలిచాయి. కబడ్డీ లో ద్వితీయ స్థానం కృష్ణా జిల్లా, శ్రీకాకుళం మూడో స్థానంలో నిలిచాయి. ఖోఖో లో ద్వితీయ స్థానం విజయనగరం, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లాల జట్లు నిలిచాయి. బ్యాడ్మింటన్, స్కేటింగ్ విజేతలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, క్రీడా సంఘాల నాయకులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

పలుచోట్ల పల్లెపండగ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాళి గ్రామంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బేబినాయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్లు, కాలువల పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 120 పనులకు రూ.7.19 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాంబాబు, ఇఒపిఆర్‌డి నీలిమ, పంచాయతీరాజ్ జెఇ వి.సత్యనారాయణ, ఎంఇఒ త్రినాథరావు, ఎఒ సునీల్, టిడిపి మండల అధ్యక్షులు నర్సుపల్లి వెంకటనాయుడు, మాజీ సర్పంచ్ శశిభూషణరావు, సర్పంచ్ హేమలత, మాజీ ఎంపిటిసి జగ్గరాజు, తదితరులు పాల్గొన్నారు.

కెరటాంలో పల్లె పండగ

బొండపల్లి : మండలంలోని కెరటాం గ్రామంలో సోమవారం పల్లె పండగ కార్యక్రమం ప్రారంభమైంది. సుమారు 12లక్షల వ్యయంతో తలపెట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ నంబూరి రాజేష్ శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.గిరిబాల, ఇఒపిఆర్‌డి ఎ.రఘుపతిరావు, పంచాయతీరాజ్ ఎఇ పి.అప్పలనాయుడు, ఎపిఒ బి.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ప్రభునాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : పల్లెల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రగతి కోసం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎస్. రఘునాథచారి అన్నారు. తలతంపర గ్రామంలో పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ చారి మాట్లాడుతూ మండలంలో అక్టోబర్ 14 నుంచి 20 వరకు నిర్వహిస్తామని అన్నారు వేతనం ఉపాధి మెరుగైన జీవన ఉపాధి కల్పన చేశామని వివరించారు గ్రామంలో మౌలిక వసతులు కల్పనతో పాటు రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగుపురపు సరస్వతి, రుగడ జగన్నాథం,కోరికనారుకాని సింహాచలం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం

భోగాపురం : నియోజకవర్గంలో ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముంజేరు మరియు చోడిపల్లిపేట గ్రామాల్లో వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగం మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, పలు రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ మాట్లాడుతూ ఐదేళ్ల పాటు వైసీపీ విధ్వంస పాలన కొనసాగిన తరువాత మళ్ళీ మన పల్లెలు అభివద్ధి బాట పడుతున్నాయని అన్నారు. మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివద్ధికీ వారం రోజులపాటు పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా సిసిరోడ్లు, బిటి రోడ్లకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కిషోర్ కుమార్, ఇఒపిఆర్ డి గాయత్రి, ఎపిఒ అదిబాబు, వైద్యాధికారి రామరాజు, ఎంపిటిసిలు బాబాజీ, వెంకట సత్యం, సర్పంచ్ సూరాడ రాములమ్మ, నాయకులు పల్లంట్ల జగదీశ్, వి రమణ, బడే గురుమూర్తి, సూరాడ చిన్నారావు, నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మార్క్‌ఫెడ్ చైర్మన్

వివిఐపి గ్యాలరీలో కుర్చీలు ఖాళీ లేక నిల్చొని మ్యూజికల్ నైట్‌ను వీక్షిస్తున్న జనం

ఎంవిఐపిలకే మ్యూజికల్ షో

వివిఐపిలకు లేదు షో..

పరిమితికి మించి పాస్‌లు.. మైదానంలో అగచాట్లు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి

విజయనగరం ఉత్సవాలు సందర్భంగా అయోధ్య మైదానంలో ఏర్పాటు చేసిన మెగా మ్యూజికల్ నైట్‌కు హాజరైన ప్రేక్షకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం తొలిరోజు 8గంటలకు, రెండోరోజు సోమవారం రాత్రి 9గంటలకు ప్రారంభం కావడంతో ప్రేక్షకులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. వివిఐపిలు అంటూ ఇచ్చిన పాస్‌లు పరిమితికి మించి ఇవ్వడంతో గ్యాలరీలోకి వెళ్లిన వారికి కూర్చునేందుకు కుర్చీలు లేకపోగా, జనాల తాకిడితో ఉక్కిరిబిక్కిరి అయి బయటకు వెళ్లేందుకు తోవ లేక నానా ఇబ్బందులు పడ్డారు. అధికారులు, వారి తపేదారులు తమ స్నేహితులకు, బంధువులకు పాస్‌లు ఇచ్చేయడంతో పిల్లాపాపలతో సహా హాజరయ్యారు. మరోవైపు ప్రజాప్రతినిధులు తమ వీధుల్లో ముఖ్యమైన కార్యకర్తలందరికీ పాస్‌లు ఇచ్చేయడంతో మైదానంలో చోటు లేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీనికి తోడు కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో కొంతమంది వెనుదిరిగారు. మైక్ సిస్టమ్ కూడా సరిగా లేక ఉన్న ఆహూతులు కూడా విసిగిచెందారు. మీడియా పాస్‌లు ఉన్న వారికి సైతం లోపలికి వెళ్లేందుకు అవకాశం లేక ఇక్కట్లు పడాల్సి వచ్చింది. వేలాదిగా వచ్చిన జనాన్ని అదుపు చేయలేక పోలీసులు చేతులెత్తేశారు. మొత్తంగా మెగా మ్యూజికల్ నైట్..పలువురు ప్రేక్షకుల్లో అసంతృప్తి మిగిల్చింది. మరోవైపు ఉత్సవాలు చూసేందుకు వేలాది జిల్లాల నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచికూడా రావడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించి పోయింది. ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి అంబేద్కర్ జంక్షన్, అటు కోట, గంటస్తంభం, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్ల : మండలంలోని అచ్యుతాపురం కూడలి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. విజయనగరానికి చెందిన ఒక వ్యక్తి చీపురుపల్లి నుంచి విజయనగరం వైపు తన టి.విఎస్ స్కూటర్‌పై వస్తుండగా ఎదురుగా విజయనగరం నుంచి గరివిడి వైపు వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన బాలుడు

బస్సును ఢీకొని వెళ్లిపోయిన ట్రిప్పర్

బస్సును ఢీకొన్న టిప్పర్

ఇద్దరికి తీవ్ర గాయాలు ● బాలుడికి తెగిపడిన చెయ్యి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఒఎస్‌ఆర్‌టిసి బస్సును టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని షికారుగంజి కూడలి సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. విజయనగరం నుంచి ఒడిశాకు ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం ఒఎస్‌ఆర్‌టిసి బస్సు వెళ్తోంది. రామభద్రపురం వైపు నుంచి విజయనగరం వైపు వెళ్తున్న టిప్పర్.. షికారుగంజి కూడలి సమీపంలో బస్సును పక్క నుంచి బలంగా ఢీకొంది. దీంతో ఒడిశాలోని కోరాపుట్ జిల్లా పొట్టంగి మండలం గుగ్గివాడువలసకు చెందిన మజ్జి పండు, ఆయన కుమారుడు బల్లేశ్ తీవ్రంగా గాయపడ్డారు. అందులో బల్లేశ్ చెయ్యి తెగిపడింది. విశాఖపట్నంలోని కెజిహెచ్‌లో వీరిద్దరూ చికిత్స పొందుతున్నారు. పండు తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి విశాఖ నుంచి స్వస్థలానికి వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశ కీలకం

ప్రజాశక్తి- గరివిడి

ఉజ్వల భవితకు విద్యార్థి దశ ఎంతో కీలకమని జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన తుమ్మగంటి అమృతవర్షిని, గుసిని రేణుక నూజివీడు ట్రిబుల్ ఐటీలో ప్రవేశాలు సాధించినందుకు, సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లీలాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, సీట్లు సాధించిన విద్యార్థినులతో పాటు, పాఠశాలల పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన దుక్క రమేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఒలు రామారావు, అప్పన్న, కొండపాలెం సర్పంచ్ ప్రతినిధి కుమార్, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బమ్మిడి కార్తీక్, మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రతిభను కనపరచడం, అభినందనీయమన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. జెడ్‌పిటిసి సమకూర్చిన నగదు ప్రోత్సాహకాలను మొదటి స్థానంలో నిలిచిన అమృత వర్షినికి రూ.5వేలు, రెండవ స్థానంలో నిలిచిన విద్యార్థిని రేణుకకు మూడు వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థి రమేష్‌కు రూ.2వేలు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు

విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ వారి సిరిమానోత్సవానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ చోట్ల బయో టాయిలెట్లు, తాగునీటి పంపిణీ కేంద్రాలను నగరపాలక సంస్థ అధికారులు ఏర్పాటు చేశారు. నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో 120 బయో టాయిలెట్ కేంద్రాలను, 33 చోట్ల తాగునీటి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశామని భక్తులు ఆయా కేంద్రాలను వినియోగించుకోవాలని కమిషనర్ నల్లనయ్య కోరారు. ప్రసాద పంపిణీ కేంద్రాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా కాగితంతో గాని లేదా విస్తరాకులతో గాని చేసిన ప్లేట్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. సిరిమానోత్సవ సమయంలో సిరిమానుపై భక్తులు విసిరే అరటిపళ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరిచేందుకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

అలరించిన సంగీత నవావధానం, సాహితీగోష్టి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో సాహిత్య వేదికపై సోమవారం నిర్వహించిన సాహితి గోష్టి, సంగీత నవావదానం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. సాహితి గోష్టి కార్యక్రమానికి డాక్టర్ జక్కు రామకృష్ణ, రాధిక అనుసంధాన కర్తలుగా వ్యవహరించారు. డాక్టర్ జివిఎస్. జయపాల రావు, అనురాధ పరశురాం, బి.సుభద్ర, లగుడు వరలక్ష్మి మరియు సంగీత నవావదానంకు కళారత్న డాక్టర్ మీగడ రామలింగ స్వామి గారు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను డాక్టర్ జనార్ధన్ నాయుడు, డైట్ కళాశాల ప్రిన్సిపల్ తిరుపతి నాయుడు, జిల్లా సహకార అధికారి రమేష్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న పాడిరైతుల జిల్లా సదస్సు

వేపాడ : ఈ నెల 18న జామిలో పాడి రైతుల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్ తెలిపారు. సోమవారం మండలంలోని బంగారయ్యపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడిపరిశ్రమ ప్రధాన వృత్తిగా ఎదిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం ఎలా ఉన్నా, పాడిపరిశ్రమ రైతులకు ఆదాయ వనరుగా మారిందని చెప్పారు. రోజురోజుకు పశుపోషణ భారంగా మారడంతో పాడి రైతులకు పాల సేకరణ ధర గిట్టుబాటు కావడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో పాడి రైతుల సమస్యలపై చర్చించేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు పాల రైతులు హాజరుకావాలని కోరారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు టిఒలుగా వ్యాయామ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 17వ తేదీ నుంచి 19 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో జరుగు జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్ గా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు ఐదుగురు నియమితులయ్యారు. వారిలో ఎం.రామకృష్ణ (జెడ్‌పి హైస్కూలు, పాలవలస), జి.గురునాయుడు (గడసాం జెడ్‌పి హైస్కూలు), పి. లీలా కృష్ణ (పిఇటి, పాసుపాం), వి.ఆనందరావు (పిఇటి, నెల్లిమర్ల బాలికల ఉన్నత పాఠశాల), ఎ.గణేష్ కుమార్ (పిఇటి, వెంపడాం హైస్కూలు) ఉన్నారు.

పత్రికా ప్రకటన

[illegible]

I.A. 242/2024 in O.S.21/2024

[illegible]

To

D7. [illegible]

D8. [illegible]

[illegible] 22-10-2024 [illegible] 10-30 [illegible]

[illegible]

14.10.2024